సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023

ఉద్యోగులూ.. తస్మాత్ జాగ్రత్త!



నియమావళి అమలులో ఎన్నికల సంఘం నిక్కచ్చిగా వ్యవహరిస్తుంది. ఉద్యోగులు కేవలం తమ విధుల నిర్వహణకు మాత్రమే పరిమితం కావాలని సూచిస్తుంది. 10లో



మత్స్యకారులకు ఉపాధి

మత్తడివాగు ప్రాజెక్టు మత్స్యకారుల ఉపాధికి వరంగా మారింది. సమీప గ్రామాల్లోని వందలాది మందికి జీవనోపాధి కల్పిస్తుంది. 11లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0/22.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్

ఆదిలాబాద్‌టౌన్: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే తగిన చికిత్స అందించి రోగి ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన అంశాలపై మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఇతర సిబ్బందికి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చాలామంది క్యాన్సర్ బారిన పడి మృత్యువాత పడుతున్నారని తెలిపారు. మొదట్లోనే దీన్ని గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేసే వీలుంటుందని తెలిపారు. వివిధ రకాల క్యాన్సర్లు, వాటి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ తదితర అంశాలకు సంబంధించి వైద్యాధికారులకు వివరించారు. ఇందులో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్షలు ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఓపెన్ స్కూల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు కొనసాగాయి. జిల్లాలో పది పరీక్షల కోసం రెండు కేంద్రాలను ఏర్పాటు చేయగా, 64 మందికి గాను 52 మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలకు ఉదయం 67 మందికి గాను 15 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు ఒక అభ్యర్థి హాజరయ్యారు. కేంద్రాలను జిల్లా కోఆర్డినేటర్ అశోక్ పరిశీలించారు.

సౌత్‌జోన్ పోటీల్లో ప్రతిభ



పతకం అందుకుంటున్న పరశురాం

ఆదిలాబాద్: హన్మకొండ జిల్లా కేంద్రంలోని జేఎన్‌స్టేడియంలో నిర్వహిస్తున్న 34వ జాతీయ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తున్నారు. సోమవారం నిర్వహించిన 600 మీటర్ల పరుగు పందెంలో కొడప పరశురాం రజత పతకం కైవసం చేసుకున్నట్లు కోచ్‌లు రాకేశ్, లక్ష్మీరాం పేర్కొన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భోజారెడ్డి, రాజేశ్ అభినందనలు తెలిపారు.

రూ.9 లక్షల నగదు సీజ్

బేల: మండలంలోని శంకర్‌గూడ చెక్‌పోస్టు వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో సోమవారం భారీగా నగదు లభ్యమైనట్లు ఎస్సై రాధిక తెలిపారు. మహారాష్ట్రలోని కోర్పణకు చెందిన శుభం శంకర్ గైక్వాడ్ ఆదిలాబాద్‌కు వెళ్లే క్రమంలో కారులో తీసుకెళ్తున్న రూ.9లక్షల నగదును గుర్తించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసి కలెక్టరేట్‌లోని ఎన్నికల కార్యాలయానికి పంపినట్లు ఎస్సై తెలిపారు.

'పిప్పర్‌వాడ' చెక్‌పోస్ట్ వద్ద రూ.5.10లక్షలు..

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న నగదును పోలీసులు సోమవారం పట్టుకున్నారు. మహారాష్ట్ర నుంచి 44వ నంబర్ జాతీయ రహదారి మీదుగా ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కారును తనిఖీ చేయగా రూ.5.10 లక్షల నగదు లభించగా స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ మునీంద్ర చించుల్కర్ ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో అతడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి నగదు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ




బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్: తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక అని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని జూబ్లీహిల్స్ కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ పవన్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద్, వార్డు కమిటీ సభ్యులు విలాస్, మనోహర్, శంకర్, దయాకర్ పాల్గొన్నారు.

ముచ్చట తీరకపాయె!

జిల్లా కేంద్రానికి శివారులో మావల మండలం బట్టిసావర్గాంలోని సర్వేనంబర్ 72లో సుమారు 23 ఎకరాల్లో నూతన కలెక్టరేట్ భవనాన్ని నిర్మిస్తున్నారు. గత జూన్‌లో ఈ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పిల్లర్లు కూడా వేశారు. పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.55 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం చేపడుతున్నారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో పనులు జరుగుతుండగా, చాబ్రా అసోసియేషన్ కాంట్రాక్ట్ సంస్థకు ఈ పనులు అప్పగించారు.





ఐటీ టవర్.. మావల మండలంలోని బట్టిసావర్గాం సర్వే నం.72లోనే మూడెకరాల స్థలంలో దీని నిర్మాణ పనులు కూడా కొద్ది నెలల క్రితం ప్రారంభించారు. రూ.40 కోట్లతో చేపడుతున్నారు. ఈ పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో స్లాబ్ లెవల్ వరకు పూర్తయ్యాయి. టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో పనులు నడుస్తున్నాయి.

- శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు 'కోడ్'తో బ్రేక్
- అప్పట్లో రద్దయిన కేసీఆర్, కేటీఆర్ పర్యటనలు
- కలెక్టరేట్ భవనం, ఐటీ టవర్ పనులు ప్రారంభమైనా భూమిపూజకు నోచుకోని వైనం

ఇది జిల్లా కేంద్రంలోని వినాయక్ చౌక్‌లో ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్మించిన నూతన మున్సిపల్ కార్యాలయం. రూ.5 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించారు. కొన్నేళ్లుగా నిర్మాణ పనులు నత్తనడకన సాగి ఎట్టకేలకు పూర్తయింది.



సాక్షి,ఆదిలాబాద్: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్ పడింది. అయితే షెడ్యూల్ విడుదలకు ముందే ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో పర్యటన ఉంటుందని పలుమార్లు పేర్కొన్నప్పటికీ ఆ తర్వాత రద్దయింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన కూడా ఇలాగే ముందుగా అనుకున్నప్పటికీ ఆ తర్వాత రద్దు కావడంతో జిల్లాలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిలిచిపోయాయి. ఎన్నికల కోడ్‌కు ముందే ఇవి నిర్వహించడం ద్వారా ముచ్చట తీర్చుకుందామనుకున్న అధికార పార్టీకి అది సాధ్యం కాలేదు. ఎన్నికలు పూర్తయిన తర్వాత డిసెంబర్‌లోనే దీనికి సంబంధించి ప్రక్రియ కొనసాగే పరిస్థితులు ఉన్నాయి.

సమీకృత కలెక్టరేట్ నిర్మాణం..

ప్రధానంగా రాష్ట్రంలోని కొత్త జిల్లాల్లో నూతన కలెక్టరేట్ నిర్మాణాలు పూర్తి కావడంతో పాటు చకచకా ప్రారంభమయ్యాయి. అయితే జిల్లాలో ఆలస్యమైనప్పటికీ ఈ పనులను ప్రారంభించేందుకు సీఎం లేనిపక్షంలో వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లాలో పర్యటించినప్పుడు భూమిపూజ చేయాలని ఎమ్మెల్యే జోగు రామన్న యోచించారు. అయితే వారిద్దరు నేతల పర్యటనలు రద్దు కావడంతో శంకుస్థాపన నిలిచిపోయింది. ఐటీ టవర్‌ది ఇదే పరిస్థితి. నూతన మున్సిపల్ కార్యాలయంను కూడా ముఖ్య నేతల పర్యటనలో ప్రారంభించేందుకు సిద్ధం చేశారు. అది కూడా సాధ్యం కాలేదు. ఇకపోతే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం గతంలోనే పట్టణంలోని కైలాస్‌నగర్‌లో ఏర్పాటైంది. దాన్ని కూడా ప్రారంభించాలని అనుకున్నారు. సోమవారం సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాలో ముఖ్య నేతల పర్యటన సందర్భంగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించే అవకాశం ఉంది.

ఎన్నికలకు సన్నద్ధం

- చకచకా ఏర్పాట్లు
- బోథ్‌లో ముస్తాబవుతున్న ఎన్నికల అధికారి కార్యాలయం



ప్రారంభానికి సిద్ధంగా ఎన్నికల అధికారి కార్యాలయం

బోథ్: అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. షెడ్యూల్ విడుదలతో అధికారులు పనులు ముమ్మరం చేశారు. బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల అధికారి కార్యాలయాన్ని ఇటీవలే నిర్మించారు. త్వరలోనే ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన పనులు చేపడుతున్నారు. ఆర్‌వో కార్యాలయంలోనే అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తారు. పరిశీలన, తుదిజాబితా సైతం ఇక్కడే ప్రదర్శించనున్నారు.

పంపిణీ కేంద్రంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల..

బోథ్ నియోజకవర్గ కేంద్రంలో పోలింగ్ సామగ్రి, ఈవీఎం, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్ల పంపిణీకి ఎన్నికల అధికారి కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని వినియోగించుకునేందుకు ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచే నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఉన్న 302 పోలింగ్ కేంద్రాలకు యంత్రాలు, సిబ్బందిని చేరవేయనున్నారు. పోలింగ్ ముగిసిన తరువాత ఈవీఎంలను ముందుగా కళాశాల స్ట్రాంగ్ రూంలో భద్రపరచి జిల్లా కేంద్రానికి తరలించనున్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు...

బోథ్ ఎన్నికల అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించారు. ఎన్నికల నియమావళి, ఉల్లంఘనలు, సమస్యలు, సందేహాలుంటే ఇక్కడికి వచ్చి నివృత్తి చేసుకోవచ్చు. త్వరలోనే కంట్రోల్ రూం ఫోన్ నంబరు అందుబాటులోకి తేనున్నట్లు అధికారులు తెలిపారు.

నియమావళి పాటించాలి



ఎన్నికల షెడ్యూల్ విడుదలతోనే కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రతి ఒక్కరూ విధిగా ప్రవర్తనా నియమావళిని పాటించాలి. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. పార్టీల సభలు, సమావేశాల నిర్వహణ, మైక్‌సెట్ల వినియోగం కోసం ముందుస్తు అనుమతి తప్పనిసరి. ఎన్నికల నిర్వహణలో భాగంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవచ్చు. – చాహత్ బాజ్‌పాయ్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బోథ్ నియోజకవర్గం

మద్యం, డబ్బు అక్రమ తరలింపు అరికట్టాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

తలమడుగు: ఎన్నికల దృష్ట్యా డబ్బు, మద్యం అక్రమ తరలింపును పూర్తిగా అరికట్టాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మహారాష్ట్ర నుంచి జిల్లాకు వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహనాల తనిఖీ సమయంలో వీడియోగ్రఫీ చేపట్టాలన్నారు. ఆయన వెంట తలమడుగు ఎస్సై ధనశ్రీ, సిబ్బంది ఉన్నారు.

కరంజి(టి) చెక్‌పోస్ట్ తనిఖీ

తాంసి: ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ల సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భీంపూర్ మండలంలోని కరంజి(టి) వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును సోమవారం తనిఖీ చేశారు. పెన్‌గంగ తీరం వెంట కూడా అక్రమ రవాణా జరుగకుండా దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట చెక్‌పోస్ట్ సిబ్బంది ఉన్నారు.

ప్రజాభీష్టం మేరకే మేనిఫెస్టో

- ఎమ్మెల్యే జోగు రామన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌రూరల్: ప్రజాభిష్టానికి అనుగుణంగానే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టో రూపొందించారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచేలా సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ మేనిఫెస్టో రూపొందించారన్నారు. రాష్ట్రంలోని పేద కుటుంబాలకు రూ.5లక్షల జీవిత బీమా, సౌభాగ్య మహిళా పథకం కింద అర్హులైన వారికి రూ.3వేల ఆర్థిక సాయం, రూ.400లకే గ్యాస్ సిలిండర్, అగ్రవర్ణ పేదల కోసం రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, దశల వారీగా ఆసరా, దివ్యాంగుల పింఛన్, రైతుబంధు సాయం పెంపు తదితర అంశాలను మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్, బీజేపీలకు ప్రజాక్షేత్రంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇందులో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపులో కార్యకర్తల పాత్ర కీలకం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ గొడం నగేశ్

నేరడిగొండ: ఎన్నికల గెలుపులో పార్టీ కార్యకర్తల పాత్ర కీలకమని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి గొడం నగేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన మండల కార్యకర్తల సమావేశానికి జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. బీఆర్ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు టి.రాజు, సుధాకర్, ఎంపీపీలు సజన్, ప్రీతంరెడ్డి, మంజుల శ్రీధర్‌రెడ్డి, బోథ్ అధికార ప్రతినిధి కిరణ్, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మన్ సింగ్, వైస్‌ఎంపీపీ మహేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ వెంకటరమణ, ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సోంబాయి, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ప్రవళికది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే'



మాట్లాడుతున్న నాయకులు

ఆదిలాబాద్: హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగి ప్రవళికది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌరాల సుభాష్, జగన్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవన్‌లో సోమవారం వారు మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం విద్యార్థులు, యువకుల బలిదానాలతో స్వరాష్ట్రం సాధించుకున్నామన్నారు. అయితే సీఎం కేసీఆర్ నీళ్ల పేరు చెప్పి నిధులను తన ఇంటికి మళ్లించుకున్నారని, ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. గ్రూప్–1 పరీక్ష ఇప్పటికే రెండు సార్లు రద్దయిందన్నారు. ఉద్యోగ ప్రకటనలిస్తూ నియామకాల ప్రక్రియ సరిగా పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ వైఖరి కారణంగానే ప్రవళిక మానసిక వేదనతో ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. ప్రవళిక ఆత్మహత్య ప్రేమ విఫలం వల్లే జరిగిందని ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగ యువత ఇప్పటికైనా ఆలోచించాలన్నారు. ప్రజల కోసం నిరంతరం పోరాడే విప్లవ పార్టీలకు మద్దతుగా నిలవాలని కోరారు. ఇందులో నాయకులు అశోక్, దండేకర్ వామన్, నితిన్, సురేష్, కృపాకర్, శ్రవణ్ తదితరులున్నారు.

బాలికల ఆత్మరక్షణకు కరాటే

- దసరా సెలవుల తర్వాత పాఠశాలల్లో శిక్షణ
- జిల్లాలో 117 పాఠశాలలు ఎంపిక
- 20వేల మంది విద్యార్థినులకు ట్రైనింగ్



కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థినులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: నిత్యం ఏదో ఒక చోట మహిళలు, యువతులు, విద్యార్థినులపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. షీటీమ్, సఖీ కేంద్రాలు, తదితర స్వచ్ఛంద సంస్థల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ వేధింపులు ఆగడం లేదు. సంఘటనలు జరిగినప్పుడు ఏ క్షణం ఏం జరుగుతుందోనన్న ఆందోళన తల్లిదండ్రుల్లో మొదలవుతోంది. ఈ క్రమంలో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించి.. స్వీయ రక్షణ చేసుకునేలా సర్కారు బడుల్లో కరాటే శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. సమగ్ర శిక్ష పథకం ద్వారా మూడు నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం శిక్షణ నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. దసరా సెలవుల తర్వాత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ పరియోజన కింద ఉన్నత పాఠశాలల్లో ఈ శిక్షణ చేపట్టనున్నారు.

7 నుంచి పదో తరగతి వరకు..

జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 7 నుంచి 10వ తరగతి విద్యార్థినులకు కరాటే శిక్షణ కల్పించనున్నారు. 17 కేజీబీవీలతో పాటు మరో 100 పాఠశాలలను ఎంపిక చేశారు. దసరా తర్వాత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. గతేడాది నెల పాటు శిక్షణ కార్యక్రమం చేపట్టగా, ఈ విద్యా సంవత్సరంలో మూడు నెలల పాటు కొనసాగుతుంది. ఇందు కోసం ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు. నెలకు రూ.3వేల చొప్పున వారికి చెల్లించనున్నారు. సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత ఈ కార్యక్రమం కొనసాగనుంది. శిక్షకులతో పాటు సంబంధిత పాఠశాలల పీఈటీలు ఉండి పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పెరగనున్న ఆత్మస్థైర్యం..

పాఠశాలల్లో విద్యార్థినులకు కరాటే శిక్షణతో వారిలో ఆత్మస్థైర్యం పెంపొందనుంది. బాలికలపై పలు రకాల వేధింపులు, వెకిలిచేష్టలు చోటు చేసుకుంటున్నాయి. కొంతమంది విద్యార్థినులు మౌనంగా భరిస్తుండగా, మరికొంత మంది ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఇంకొంత మంది ఈ బాధను ఎవరికి చెప్పుకోలేక బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో బాలికల్లో మనోధైర్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. వారిలో ధైర్యం, తల్లిదండ్రుల్లో భరోసా కల్పించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయుక్తం కానుంది. కరోనాకు ముందు కేజీబీవీల్లో శిక్షణ కార్యక్రమం కొనసాగగా, గతేడాది నుంచి ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. అయితే మూడు నెలల పాటే శిక్షణ కార్యక్రమం కొనసాగించేందుకు ఉత్తర్వులు వెలువడగా, నిరంతరం ఈ ప్రక్రియ కొనసాగిస్తే విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

శిక్షణ ఎక్కువ కాలం ఉండాలి



నేను గతేడాది మా కేజీబీవీలో కరాటే శిక్షణ పొందాను. అయితే కొద్దిరోజులు మాత్రమే ఇచ్చారు. ఏడాదంతా ఇస్తే బాగుంటుంది. ట్రైనింగ్‌తో ఏవైనా సమస్య వచ్చినప్పుడు ఎదుర్కొనేందుకు మాలో ధైర్యం వస్తుంది. మరింతగా సాధన చేసి శిక్షణ పూర్తి చేసుకుంటాను. – వైష్ణవి, కేజీబీవీ విద్యార్థిని, ఆదిలాబాద్‌రూరల్

ఆత్మస్థైర్యం పెంపొందింది..



కరాటే శిక్షణ ద్వారా మాలో ఆత్మస్థైర్యం పెంపొందింది. క్రమశిక్షణ, ఏకాగ్రత, తదితర విషయాల గురించి కూడా నేర్పించారు. చదువుతో పాటు ఆత్మరక్షణకు సంబంధించి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉంది. ఈ శిక్షణ ద్వారా ఆపద సమయంలో ఎవరికి వారే రక్షించుకునే అవకాశం ఉంటుంది. – హర్షవర్ధిని, కేజీబీవీ విద్యార్థిని, ఆదిలాబాద్‌రూరల్


పకడ్బందీగా నిర్వహిస్తాం..



రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ పరియోజన కార్యక్రమం కింద జిల్లాలో 117 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటిలో మూడు నెలలపాటు కరాటే శిక్షణ కార్యక్రమాన్ని పకడ్బందీగా కొనసాగిస్తాం. కరాటే ద్వారా విద్యార్థినుల్లో ఆత్మరక్షణతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందుతుంది. దసరా సెలవుల తర్వాత నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. – ఉదయశ్రీ, సెక్టోరియల్ అధికారి

ఎస్టీ హోదా సాధించే వరకు పోరాటం

- మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తాంసి: మాలీ కులస్తులకు ఎస్టీ హోదా కల్పించే వరకు విడతల వారీగా ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామని మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన జెండా పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథి గా హాజరయ్యారు. జ్యోతిబాపులే విగ్రహనికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. మాలీ కులస్తుల ఎస్టీ హోదా బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం లభించేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఇందులో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, జిల్లా అధ్యక్షుడు విజయ్ వాడ్గురే, సర్పంచ్ కృష్ణ, క్రాంతి యూత్ అధ్యక్షుడు అశోక్, పాల్గొన్నారు.

క్లుప్తంగా

భారీ చోరీలో ఆధారాలు లభ్యం?

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణ ఎన్‌క్లేవ్‌లో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. ఆదిలాబాద్ రూరల్ సీఐ సైదారావు కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా భైంసా ప్రాంతీయ ఆసుపత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జి కొమురయ్య నారాయణ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని దుర్గామాత మండపం వద్దకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. కప్‌బోర్డులో దాచిన 15 తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని సీసీ ఫుటేజీలు పరిశీలించారు. వేలిముద్రల నిపుణులతో ఆధారాలు సేకరించారు. కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి చోరీకి పాల్పడ్డ వ్యక్తిని గుర్తించినట్లు సీఐ తెలిపారు. ఆభరణాల రికవరీ కోసం విచారణ చేపడుతున్నామని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

పోలీసుల తనిఖీ.. రూ.3.58 లక్షలు స్వాధీనం

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాల సమీపంలో ఇచ్చోడ, సొనాల ఆర్‌అండ్‌బీ రోడ్డుపై సోమవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రలోని మహాగావ్‌కు వెళ్తున్న కారులో రూ.3.58 లక్షలు నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. కారు నడుపుతున్న మహాగావ్‌కు చెందిన బంచర్ల రాజేశ్‌ను విచారించగా నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపించలేదు. దీంతో నగదును ఎన్నికల ఎఫ్‌ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ సంబరాల్లో వర్సిటీ వీసీ, సిబ్బంది

భైంసాటౌన్: బాసర ఆర్జీయూకేటీలో సోమవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళా అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థినులు ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిక ప్రతీక బతుకమ్మ అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్, బతుకమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులూ.. తస్మాత్ జాగ్రత్త!

- రాజకీయ పక్షాలకు కొమ్ముకాయొద్దు
- ప్రచారంలో పాల్గొంటే వేటే..
- ఎన్నికల కమిషన్ పకడ్బందీ ఆదేశాలు

జంగ్ తెలంగాణ

కెరమెరి(ఆసిఫాబాద్): ఎన్నికల సంఘం నియమావళి అమలులో నిక్కచ్చిగా వ్యవహరిస్తుంది. ఉద్యోగులు కేవలం తమ విధుల నిర్వహణకు మాత్రమే పరిమితం కావాలని, ఏ రాజకీయ పక్షానికీ కొమ్ము కాయవద్దని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఎన్నికల నియమావళి నిబంధనలపై వివిధ శాఖల అధికారులకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది. పార్టీలకు అనుకూలంగా పనిచేసినా.. ప్రచారంలో పాల్గొన్నా వేటు తప్పదు.



ఉద్యోగులకు ఎన్నికల నియమావళి వివరిస్తున్న కెరమెరి ఎంపీడీవో మహేందర్

నిబంధనలు ఇవే..

- ప్రభుత్వ ఉద్యోగులు ఏరాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొనవద్దు.
- పలానా పార్టీకి ఓటేయాలని కిందిస్థాయి ఉద్యోగులను నిర్దేశించకూడదు.
- ఓటర్లు ప్రలోభాలకు గురయ్యేలా ప్రకటనలు ఇవ్వకూడదు.
- రాజకీయ పార్టీల కండువాలు వేసుకుని ప్రచారం నిర్వహించకూడదు.
- సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు చేయకూడదు.
- అధికార, ప్రతిపక్ష పార్టీలకు సమదూరంలో ఉద్యోగులు ఉండాలి.
- ఎన్నికల నియమావళి అమలులో భాగంగా ప్రచార సమావేశాలు, సభలపై వీడియో సర్వలైన్స్, స్టాటిస్టికల్ సర్వలైన్స్ బృందాలు వీడియో చిత్రీకరిస్తున్నాయి. వాటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వీక్షిస్తాయి. అందులో ఉద్యోగులు పాల్గొన్నట్లు రాజకీయ పార్టీకి చెందిన ప్రతినిధి ఫిర్యాదు చేస్తే ఎన్నికల సంఘానికి నివేదించాల్సి ఉంటుంది.
- నిర్ధారణ అయితే సదరు ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు పడుతుంది.
- సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులు, మీడియాలో వచ్చే వార్తలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా మీడియా మానిటరింగ్ టీంను ఏర్పాటు చేశారు.
- ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల్లో రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉద్యోగులు పోస్టులు చేస్తే ఎన్నికల సంఘం చర్యలు తీసుకోనుంది.
- ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించిన ఉద్యోగులను మొదట విధుల నుంచి తప్పించి విచారణ చేపడతారు.
- ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే సమావేశాలకు రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించవద్దు.
- నూతన నిర్మాణాలు, పథకాలు నాయకుల చేత ప్రారంభించకూడదు.
- వారిచ్చే కానుకలు తీసుకోకూడదు. వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగవద్దు.
- నాయకుల వాహనాల్లో ప్రయాణించవద్దు.
- స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ, ఇతర ఆర్థిక కార్యక్రమాల్లో పాల్గొన్న సమయంలో తీర్మాణం కాపీ తప్పనిసరిగా ఉండాలి.

'గిరి'పుత్రుల్లో చైతన్యం

- 2018 ఎన్నికల్లో గిరిజన గ్రామాల్లో 85శాతం పైనే పోలింగ్



ఇచ్చోడ(బోథ్): 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని పలు మారుమూల గిరిజన గ్రామాల్లో 85 శాతంకు పైగా పోలింగ్ నమోదైంది. అంతకుముందు వాటన్నింటినీ సమస్యాత్మక గ్రామాలుగా పోలీసులు, ఎన్నికల అధికారులు గుర్తించారు. నియోజకవర్గంలో అత్యంత మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఆయా గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల అధికారులు, పోలీసులకు కత్తిమీద సాములాగే ఉండేది. గతంలో నక్సల్స్ ప్రభావిత గ్రామాలుగా గుర్తింపబడి ఎన్నికలు బహిష్కరించిన గ్రామాలు సైతం ఇందులో ఉండడం విశేషం. కానీ 2018లో నిర్వహించిన ఎన్నికల్లో అధికశాతం మంది ప్రజలు ఓటుహక్కును వినియోగించుకున్నారు. 85 శాతంకు పైగా పోలింగ్ నమోదు రికార్డు సృష్టించి గత చరిత్రను తుడిచివేశారు.

బోథ్ నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ నమోదైన గ్రామాలు

పీఎస్ నంబర్	గ్రామం	మండలం	పోలింగ్ శాతం
01	గుబిడి	తాంసి	85.0
15	మార్కగూడ	తాంసి	93.03
24	పాలోది	తాంసి	90.02
34	గిరిగావ్	తాంసి	89.01
35	అంబుగావ్	తాంసి	90.5
36	పల్సి(కె)	తలమడుగు	92.02
59	దెహగావ్	తలమడుగు	88.04
62	నందిగామ	తలమడుగు	93.02
117	సల్యాద	ఇచ్చోడ	95.01
131	ఎల్లమ్మగూడ	ఇచ్చోడ	91.04
207	కుంటల(కె)	నేరడిగొండ	88.02
215	బోరిగామ	నేరడిగొండ	92.06
218	గుత్పల	నేరడిగొండ	88.03
220	లింగాట్ల	నేరడిగొండ	88.01
222	రాజూర	నేరడిగొండ	85.04

ముధోల్‌లో పెరుగుతున్న పోలింగ్ శాతం

- 2018లో 98.7 శాతంగా నమోదు

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెరుగుతోంది. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో దాదాపు 70 శాతానికి మించి పోలింగ్ శాతం నమోదు కాగా 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 98.7 శాతంగా నమోదైంది. 2023 ఓటరు జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,46,030 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,19,910 మంది, మహిళలు 1,26,102 మంది, ఇతరులు 18 మంది ఉన్నారు.

ఏడాది	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
1978	92,616	65,681	70.9
1983	1,02,536	71,277	69.5
1985	1,10,291	77,404	70.2
1989	1,21,909	96,494	79.2
1994	1,41,112	1,11,081	78.7
1999	1,62,379	1,22,057	75.2
2004	1,67,579	1,28,712	76.8
2009	1,75,877	1,38,102	78.5
2014	2,08,805	1,62,872	78.0
2018	1,86,418	1,81,696	98.7

యువతదే నిర్ణయం..!

- గెలుపోటములను ప్రభావితం చేసేది వారే..

ఇచ్చోడ/బోథ్: ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలో అత్యధికంగా 96,668 మంది యువ ఓటర్లు ఉన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసి సత్తా చాటే శక్తి యువత చేతిలోనే ఉంది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,35,743 మంది ఉండగా యువ ఓటర్లు 54,998 మంది ఉన్నారు. బోథ్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,06,690 మంది ఉండగా యువ ఓటర్లు 41,670 మంది ఉన్నారు. దీంతో ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతున్న ప్రధాన పార్టీలు యువతపై దృష్టి పెట్టాయి. అయితే యువత దాదాపు చదువుకున్న వారు ఉండటం, సామాజిక అంశాలు తెలుసుకునే సామర్థ్యం ఉండటంతో ఎటువైపు మొగ్గు చూపుతారోనని రాజకీయ పార్టీల నాయకుల్లో కలవరం నెలకొంది.

యువతకు ప్రత్యేక పోలింగ్ కేంద్రం

యువతను ప్రోత్సహించేందుకు, ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా ఈసారి ఎన్నికల సంఘం ప్రతీ నియోజకవర్గంలో యువత ఎక్కువగా ఉన్నచోట ప్రత్యేకంగా యూత్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో అధికారులు సైతం యువకులే ఉండేలా ఎన్నికల సంఘం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

బాధ్యతగా ఓటు వినియోగించుకోవాలి

ఎన్నికల్లో యువత బాధ్యతగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలి. బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాల్లో యువ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రతిఒక్కరూ ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– చాహత్ బాజ్‌పాయ్, బోథ్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ప్రలోభాలకు లొంగవద్దు



ప్రజాస్వామ్యంలో నచ్చిన వ్యక్తికి ఓటు వేసి ప్రజాప్రతినిధిగా ఎన్నుకునేలా రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు. అందుచేత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును వినియోగించుకుని రాజ్యాంగా విలువలు కాపాడుతా.

– అశ్విని సూర్యవంశీ, బజార్‌హత్నూర్

ఓటు అమ్ముకోవద్దు



మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనుండడంతో చాలా సంతోషంగా ఉంది. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడంతో పాటు అవినీతికి పాల్పడని వారికే ఓటు వేస్తా. ఓటు రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు. ఓటును ఎవరూ అమ్ముకోవద్దు.

– సాయితేజ, బజార్‌హత్నూర్

సమస్యలు పరిష్కరించే వారికే..



ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక నిరుద్యోగులు చాలాకాలంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో యువత సమస్యలు పరిష్కరించే వారికే ఓటు వేస్తా.

– సిద్ధవేని అభిగౌడ్, సిరికొండ

గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలి



రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షుడు భరత్ వాఘ్మారే డిమాండ్ చేశారు. ఈ మేరకు మావలలోని పాత జాతీయ రహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులను నచ్చజెప్పి వారిని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరులకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలన్నారు. రుణమాఫీ వర్తింపుతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఇందులో సంఘం నాయకులు దుర్గం శేఖర్, నర్సయ్య, విద్యాసాగర్‌రెడ్డి, రాజారెడ్డి, నాగోరావ్, నర్సింగ్, మసూద్, సంజీవ్, రమేశ్, మాధవ్, పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చంద్రశేఖర్

ఇచ్చోడ: పలు గ్రామాల్లో గంజాయి సాగు చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో సోమవారం వివరాలు వెల్లడించారు. నేరడిగొండ మండలంలోని కిష్టాపూర్, సిరికొండ మండలంలోని భీంపూర్‌లో గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందినట్లు తెలిపారు. ఈ మేరకు ఏకకాలంలో దాడులు నిర్వహించి ఆయా చోట్ల 62 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే భీంపూర్‌కు చెందిన కనక చిన్ను, మోరె శ్రవణ్, కిష్టాపూర్‌కు చెందిన సోలంకే సర్‌సింగ్‌ను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. గుర్తించిన గంజాయి మొక్కల విలువ సుమారు రూ.6.20లక్షల వరకు ఉంటుందని తెలిపారు. సమావేశంలో నేరడిగొండ, సిరికొండ ఎస్సైలు సాయన్న, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో గోముత్రి ఉపసర్పంచ్ మృతి



శేషరావు(ఫైల్)

తాంసి: భీంపూర్ మండలంలోని గోముత్రి గ్రామ ఉపసర్పంచ్ మేస్రం శేషరావు (35) గుండెపోటుతో మృతి చెందాడు. ఈయన కొద్ది కాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం గుండెపోటుకు గురయ్యారు. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉపసర్పంచ్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ డాల్డా కంపెనీ సమీపంలో మట్కా నిర్వహిస్తు న్న షేక్ సాహిల్‌ను సీసీఎస్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఆయన నుంచి మట్కా చీటీలతో పాటు రూ.6,030 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్ తెలిపారు.

అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నవీన్



నవీన్‌యాదవ్

ఖానాపూర్: అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జక్కుల నవీన్ యాదవ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మండలంలోని బీర్నంది మాజీ సర్పంచ్ నవీన్‌యాదవ్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీతోపాటు పలు జిల్లాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. నవీన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కార్యదర్శిగా ఎన్నికయ్యేందుకు సహకరించిన సంఘం జాతీయ, రాష్ట్ర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అటవీ హక్కుచట్టంపై అవగాహన కల్పించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనులకు అటవీ హక్కు చట్టంపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. స్థానిక కుమురంభీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, సెంటర్ ఫర్ కలెక్టివ్, ఫారెస్ట్ ప్రాజెక్టు మేనేజర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. అటవీ హక్కు చట్టం, దాని ఉద్దేశం గిరిజనులకు గ్రామ స్థాయిలో తెలపాలన్నారు. అలాగే ఏజెన్సీలో గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులు, వాటి ప్రాధాన్యత, ధరపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీడీ దిలీప్, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీసా కోఆర్డినేటర్ వసంత్‌రావు, సీసీడీ కుమ్ర విఠల్‌రావు, పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో దంపతులకు జైలు

నిర్మల్‌టౌన్: ఒకరి హత్యాయత్నం కేసులో భార్య, భర్తలకు నిర్మల్ న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించింది. కోర్టు సమన్వయ అధికారి సక్రియనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కుంటాల సుందర్ తన సొంత పని నిమిత్తం 2022, జూలై 21న నిర్మల్‌కు వచ్చాడు. పాత బస్టాండ్ ఏరియాలో సోన్ మండలం గంజాల్ గ్రామానికి చెందిన దంపతులు జోశేకర్ గజేందర్–రాణి అలియాస్ నర్రా వనిత సుందర్‌ను పరిచయం చేసుకున్నారు. ఏదైనా పని ఇప్పించాలని కోరారు. సుందర్ వారి మాటలు నమ్మి తన ఇంటికి తీసుకెళ్లాడు. వెళ్లిన కాసేపటికే సుందర్ తన భార్యతో చనువుగా మాట్లాడుతున్నాడని గజేందర్ ఖాళీ విస్కీ సీసాతో దాడిచేశాడు. ఈ ఘటనలో తల, శరీరంపై గాయాలయ్యాయి. గజేందర్ భార్య రాణి తన భర్తకు మద్దతుగా సుందర్ రెండు చేతులు పట్టుకుని చంపాలని ప్రోత్సహించింది. సుందర్ అరవగా చుట్టుపక్కల వారు వచ్చారు. దీంతో భార్యాభర్తలు పారిపోయారు. ఈ విషయంపై సుందర్ మిత్రుడు చిట్టి చిన్నయ్య దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై గంగాధర్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపర్చగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.రమణారావు 13 మంది సాక్షుల ను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. దీంతో గజేందర్, రాణి దంపతులకు ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ జడ్జి అజేశ్‌కుమార్ తీర్పు ఇచ్చారు.

పాలు పొంగించి.. పత్తి పంట తీసి



కుండలో పాలు పొంగిస్తున్న మహిళా రైతు



సీతమ్మ ఉయ్యాల కట్టి పూజలు చేస్తూ..

తాంసి: ఈ సీజన్‌లో రైతులు సాగు చేసిన పత్తి పంట చేతికొచ్చే సమయం ఆసన్నమైంది. ఇప్పుడిప్పుడే కాయ విచ్చుకుంటుంది. పంటను తీసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. అయితే మొదట పత్తి తీసే క్రమంలో చేలల్లో పూజలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా తాంసి, భీంపూర్ మండలాల్లోని పలువురు రైతులు సోమవారం చేల వద్ద పాలు పొంగించి పత్తి తీత షురూ చేశారు. పత్తికర్రల మధ్య ఉయ్యాల కట్టి సీతమ్మను తయారు చేసి, ఐదు రాళ్లను పంచ పాండవులుగా పూజించారు. కుండలో పాలు పెట్టి పొంగించి తొలుత తీసిన పత్తిని అందులో ముంచి పనులకు శ్రీకారం చుట్టారు.

రెగ్యులర్ వేతన బిల్లులు అనుమతించాలి

ఎదులాపురం: ఉపాధ్యాయ బదిలీల నేపథ్యంలో అక్టోబర్‌కు సంబంధించి రెగ్యూలర్ వేతన బిల్లులు అనుమతించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జాదవ్ అశోక్ కుమార్ అన్నారు. ఈ మేరకు జిల్లా ట్రెజరీ అధికారికి సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన బదిలీలు, పదోన్నతుల్లో కొందరు ఉపాధ్యాయులు ఈ నెల మొదటి వారంలో నూతన పాఠశాలల్లో చేరారన్నారు. అయితే వారందరి రెగ్యూలర్ వేతన బిల్లు ఈ నెలలో కొత్త స్టేషన్‌లో చేయుటకు సాఫ్ట్‌వేర్‌లో సమస్యలు వస్తున్నాయని తెలిపారు. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుల వేతనాలను సప్లిమెంటరీ బిల్స్ చేస్తామని డీడీడబ్ల్యూలు తెలుపుతున్నారని వెల్లడించారు. ప్రస్తుతం సప్లిమెంటరీ బిల్లులు ఎప్పుడు జమ అవుతాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని బదిలీ జరిగిన ఉపాధ్యాయులకు వేతనాలు జమ అయ్యేలా చూడాలని కోరారు. ఇందులో నాయకులు శ్రీనివాస్, నరేందర్, రవీంద్ర, సత్యనారాయణ ఉన్నారు.

బాసరలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు



వెండి పాదుకలను ఇస్తున్న నాగేశ్వర్‌రావు కుటుంబీకులు

భైంసా: బాసర అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేకువజామునుంచే బాసర వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గంగమ్మ తల్లికి పూజలు చేసి అక్కడి సూర్యేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. తర్వాత సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గోదావరి నది వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



గోదావరి నదిలో స్నానాలుచేస్తున్న భక్తులు

అమ్మవారికి వెండి పాదుకలు..

బాసర సరస్వతీ అమ్మవారికి యాల్లప్రగడ నాగేశ్వర్‌రావు కుటుంబీకులు వెండి పాదుకలను కానుకగా సమర్పించారు. 13 కిలోల ఇత్తడి పీఠంపై 1,617 గ్రాముల మిశ్రమ వెండితో అమ్మవారి పాదాలు తయారు చేయించారు. రూ.1,95,826 విలువైన అమ్మవారి పాదాలు దేవస్థానానికి విరాళంగా ఇచ్చారు. తన కుమారులు అమ్మవారి అనుగ్రహంతో ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నారని అమ్మవారి ఆశీర్వాదంతోనే తాము ఈ స్థాయికి వచ్చామని నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆలయ ఈవో విజయరామారావుతోపాటు ప్రధాన అర్చకులకు ఈ పాదుకలను అందించారు.

మత్స్యకారులకు ఉపాధి

- మత్తడివాగుపై జీవనాధారం
- ఏటా ప్రాజెక్టులో చేప, రొయ్యపిల్లల విడుదల
- పెడ్డు నిర్మించాలంటున్న మత్స్యకారులు
- రైతులకు సైతం ఖరీఫ్, రబీకి సాగునీరు

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామం సమీపంలోని మత్తడివాగు ప్రాజెక్టు మత్స్యకారుల ఉపాధికి వరంగా మారింది. మత్తడివాగు ప్రాజెక్టు చుట్టూ పక్కల గ్రామాల్లోని వందలాది మంది మత్స్యకారులకు నిత్యం జీవనోపాధి కల్పిస్తుంది. దీంతో పాటు ఆయా గ్రామాల రైతులకు సాగునీటిని సైతం అందిస్తూ రైతులకు పంటల సాగుకు ప్రధాన నీటి వనరుగా మారింది. జిల్లాలో మధ్యతరహ నీటి ప్రాజెక్టులో భాగంగా తాంసి, తలమడుగు మండలాల్లోని వివిధ గ్రామాల్లోని వాగుల ద్వారా వచ్చే వరదనీరు వృథా పోకుండా ఒడిసి పట్టేందుకు వడ్డాడి సమీపంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం ప్రాజెక్టు నిర్మాణానికి 2004లో శంకుస్థాపన చేసి ప్రాజెక్టు నిర్మాణాన్ని 2008లో పూర్తిచేశాడు. జిల్లాలోని మధ్య తరహ ప్రాజెక్టులో ఒకటిగా మత్తడివాగు 15 ఏళ్లుగా జిల్లాలో ఒకటిగా నిలుస్తుంది. ప్రాజెక్టులో యేటా వర్షాకాలంలో వరదనీటిని నిల్వచేసి ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలకు నీటిని అందిస్తున్నారు. ప్రాజెక్టు నిల్వ నీటిలో చేపపిల్లలను పెంచడం ద్వారా ప్రాజెక్టు సమీపంలోని ఐదు గ్రామాలకు చెందిన గంగపుత్రుల కుటుంబాలకు మత్తడివాగు ప్రాజెక్టు సైతం జీవనాధారంగా మారింది. దీంతో మత్స్యకారులకు చేతినిండా పని దొరుకుతుంది.

యేటా ప్రాజెక్టులో చేపపిల్లల విడుదల...

గంగపుత్రులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతీ సంవత్సరం రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఉన్న ప్రాజెక్టులతో పాటు, చెరువుల్లో, నీటివనరుల్లో మత్స్యశాఖ తరఫున చేప, రొయ్య పిల్లలను వదులుతోంది. దీనిలో భాగంగా ఏటా జిల్లా మత్స్యశాఖ అధికారులను మత్తడివాగు ప్రాజెక్టులో 5.84లక్షలకు పైగా చేపపిల్లలతో పాటు రొయ్య పిల్లలను వదులుతున్నారు. ఈ ఏడాది కూడా ప్రాజెక్టులో ఇరవై రోజుల క్రితం అధికారులు చేపపిల్లలను మత్స్యశాఖ అధికారులు వదిలారు. ప్రతీ సంవత్సరం చేపపిల్లలను వదలడం ద్వారా ప్రాజెక్టులో మత్స్యసంపద మరింత వృద్ధి చెందుతుంది. మత్స్యకారులు సైతం చేపల పెంపకాన్ని పర్యవేక్షిస్తున్నారు. చేపలు త్వరగా ఎదిగే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.


ప్రాజెక్టులో చేపలు పడుతున్న మత్స్యకారులు (ఫైల్)

200పైగా కుటుంబాలకు ఉపాధి



మత్తడివాగు ప్రాజెక్టులో ప్రతీ సంవత్సరం వందశాతం రాయితీతో చేపపిల్లలను వదలడం ద్వారా మత్స్యసంపద ప్రాజెక్టులో ప్రతీ ఏటా మరింతగా పెరుగుతోంది. మత్తడివాగు ప్రాజెక్టులో వదిలిన చేపపిల్లలు వృద్ధి చెందడంతో ప్రాజెక్టు చుట్టూ ఉన్న పరిసర గ్రామాల మత్స్యకారులు ప్రాజెక్టులో చేపలు పడుతూ స్వయం ఉపాధి పొందుతున్నారు. మండలంలోని తాంసి, వడ్డాడి, హస్నాపూర్, ఉండం, హస్నాపూర్ గ్రామాలకు చెందిన 200మంది మత్స్యకారులు ప్రాజెక్టులో చేపలు పడుతూ పదేళ్లుగా జీవనం సాగిస్తున్నారు. అయితే ప్రాజెక్టు సమీపంలో షెడ్డు నిర్మించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

నిత్యం చేపలు పడుతాం..



గ్రామానికి సమీపంలోని మత్తడివాగు ప్రాజెక్టులో నిత్యం వలలు వేస్తూ చేపలు పడుతూ వాటిని అమ్ముతూ జీవనాన్ని కొనసాగిస్తున్నాను. ప్రాజెక్టు చేప పిల్లలను ప్రతీ సంవత్సరం ప్రభుత్వం తరఫున వదలడం ద్వారా చేపల సంఖ్య పెరుగుతూ వస్తుంది. ప్రాజెక్టులో చేపలు పెరుగడంతో త్వరగా చేపలు వలలకు చిక్కుతున్నాయి. వలలో చిక్కిన చేపలను గ్రామంలో తిరుగుతూ విక్రయించి వచ్చిన డబ్బులతో ఉపాధి పొందుతున్నాను.

– జింక రాములు, మత్స్యకారుడు, తాంసి

షెడ్డు నిర్మిస్తే బాగుంటుంది..



ప్రాజెక్టులో చేపలను పట్టిన మత్స్యకారులు ప్రాజెక్టు వద్ద విక్రయించడానికి అంతర్రాష్ట్ర రోడ్డు దగ్గర షెడ్డు నిర్మిస్తే బాగుంటుంది. చేపలను స్థానికంగా విక్రయించడానికి మత్స్యకారులకు కొంత మేర సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో పట్టిన చేపలను రోడ్డుపై లేదా బయట గ్రామాల్లో తిరుగుతూ విక్రయించాల్సి వస్తుంది. షెడ్డు నిర్మిస్తే బాగుంటుంది.

– సురేష్ మత్స్యకారుడు, ఉండం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బోథ్: మండలంలోని సొకెర సమీపంలో ఆటో, ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుంచి సోయా పంట కోతకోయడానికి కొత శివారు ప్రాంతానికి వచ్చారు. తిరిగి మహారాష్ట్రకు ఆటోలో వెళ్తున్న సమయంలో సొకెర గ్రామం దాటిన తరువాత ఓ ఆటోను ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో ఎదురుగా ట్రాక్టర్ రావడంతో ట్రాక్టర్, ఆటో ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో ప్రకాష్, శకుంతలకు గాయాలయ్యాయి. వెంటనే ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

సరుకులు అందజేత


సరుకులు అందిస్తున్న జెడ్పీటీసీ

తలమడుగు: మండలంలోని కోసాయి గ్రామానికి చెందిన టేకం లక్ష్మీబాయి ఇల్లు ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోవడంతో సోమవారం జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి నిత్యావసర సరుకులైన బియ్యం, పప్పు, నూనె, చక్కెర, ఇతర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో తనవంతుగా సాయం చేసినట్లు పేర్కొన్నాడు. బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపాడు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఆర్థిక సాయం అందేలా చూస్తానని పేర్కొన్నాడు. కార్యక్రమంలో సర్పంచ్ సుభాష్, ఎంపీటీసీ వెంకన్న, మాజీ ఎంపీటీసీ దాదారావు, దత్తు, ప్రకాష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భారీ మోజార్టీతో గెలుపునకు కృషి


అనిల్ జాదవ్‌ను కలిసిన ఎంపీపీ ప్రీతంరెడ్డి

ఇచ్చోడ: బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్‌ను భారీ మోజార్టీ గెలుపు కోసం మండల నాయకులు, కార్యకర్తలంత కలిసికట్టుగా కృషి చేస్తామని ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అన్నారు. సోమవారం అనిల్ జాదవ్‌ను మార్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఇచ్చోడ మండలంలో అనిల్‌జాదవ్‌కు భారీ మోజార్టీతో గెలపునకు కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఇచ్చోడ ఉప సర్పంచ్ లోక శిరిష్‌రెడ్డి, నాయకులు గట్టు మహేందర్, భూషన్, విజయ్, అభి, బ్రహ్మలు ఉన్నారు.

'పార్టీ గెలుపు కోసం పని చేయాలి'

ఎదులాపురం: బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని శాంతినగర్ వార్డు అధ్యక్షుడు బొజ్జ సంతోష్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ వాల్ స్టిక్కర్లు ప్రదర్శించి అందరికీ అందజేశారు. ఇందులో వార్డు ఇన్‌చార్జి, పట్టణ అధ్యక్షుడు అజయ్, ఉదయ్‌కుమార్, దారవేణి రాము, బొజ్జ సంతోష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ పార్టీ సమావేశం

బోథ్: మండల కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో బోథ్ మండల బీఆర్ఎస్ పార్టీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తుల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10గంటలకు సమావేశం ఉంటుందని, జిల్లా పార్టీ అధ్యక్షుడు జోగు రామన్న, ఎంఎల్‌సీ విఠల్, జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బోథ్ ఎన్నికల ఇన్‌చార్జి నగేష్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, లోక భూమారెడ్డి పాల్గొంటారన్నారు. ప్రతీ గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు వందలాదిగా తరలిరావాలని కోరారు.

నేడు కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి సమావేశం

బోథ్: బోథ్ నియోజవర్గంలోని పది మండలాల్లోని కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల అబ్జర్వర్ రాథోడ్ ప్రకాష్ మంగళవారం సమావేశం కానున్నట్లు లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ బోథ్ నియోజకవర్గ సమన్వయకర్త పసుల చంటి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేరడిగొండ 12.30లకు, బోథ్ 2.00లకు, సొనాల 2.30 లకు, ఇచ్చోడ 3.30 లకు, గుడిహత్నూర్ 4.30లకు, సిరికొండ 5.00లకు. బజార్‌హత్నూర్ 5.30లకు, తలమడుగు 6.30 లకు, తాంసి 7.00లకు, భీంపూర్ 7.30 గంటలకు ఆయా మండల పార్టీ కార్యాలయాల్లో కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు ప్రతి నాయకుడు, కార్యకర్త పాల్గొనాలని కోరారు.

నేడు బీజేపీ అసెంబ్లీ స్థాయి సమావేశం

బోథ్: బీజేపీ బోథ్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం షార్ప్ గార్డెన్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ సుభాష్ సూర్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. అన్ని మండలాల కార్యవర్గం, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ కమిటీ అధ్యక్షుడు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

గాయత్రి మాత అలంకరణలో అమ్మవారు


గాయత్రి రూపంలో అమ్మవారు

ఆదిలాబాద్‌రూరల్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం దుర్గమాత గాయత్రి దేవత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా కేంద్రంలోని సాయినగర్‌లో గల రేణుక మాత (ఎల్లమ్మ) ఆలయంలో భక్తులు అమ్మ వారికి ప్రత్యేక పూ జలు చేశారు. అనంతరం కుంకుమార్చన, లలితా సహస్ర నమం పారాయణం పటించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

బోథ్: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోథ్ మండల కేంద్రంలో అత్యంత భక్తిశ్రద్ధలతో కుంకుమపూజ గావించారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ మేనిఫెస్టో


మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

ఇంద్రవెల్లి: సీఎం కేసీఆర్ విడుదల చేసిన బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఉందని ఎంపీపీ పోటే శోభాబాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యలు తెలిసిన ముఖ్యమంత్రిగా సీఎం కేసీఆర్ ప్రజలకు మరింత చేరువయ్యేలా అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. గత ఎన్నికల్లో చెప్పిన హామీలు కూడా అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, ఇప్పుడు మేనిఫెస్టో పెట్టిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లో అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జా జీలానిబేగ్, బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ షేక్ సుఫీయన్, ఎంపీటీసీ కోవ రాజేశ్వర్, నాయకులు కనక తుకారం, కనక హనుమంత్‌రావ్, రాథోడ్ పర్శురాం నాయక్, పోటే సాయినాథ్ ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే జోగు రామన్న వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా అభివృద్ధి పరంగా ముందుకు సాగుతుందన్నారు. సమర్థవంతమైన పాలన అందించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అజయ్, స్వరూపరాణి, మల్లయ్య, ఇస్రార్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు


బతుకమ్మకు పూజలు చేస్తున్న సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని నలంద కళాశాల ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసిని రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థినులు, అధ్యాపకులు తీరొక్క పువ్వులతో అందంగా బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ బతుకమ్మను మధ్యలో ఉంచి పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

'24గంటల విద్యుత్ సరఫరాలో బీఆర్ఎస్ విఫలం'


ఏఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బేల: వ్యవసాయ రంగానికి 24గంటల విద్యుత్ సరఫరాలో విద్యుత్ సరఫరాలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరంతరం విద్యుత్ అంతరాయ సమస్యపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 15న రాత్రివేళ 7గంటల మండల వ్యాప్తంగా తీవ్ర విద్యుత్ అంతరాయంతో దేవి నవరాత్రి ఉత్సవాల్లో చీకట్లో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. చివరగా ఏఈ సంతోష్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఎండీ అఖిల్, ఠాక్రే విపిన్, బాపురావు, కన్యరాజు, శివ, కొడప విలాస్ పాల్గొన్నారు.

సమాజసేవలో ముందుండాలి


సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: మరిన్ని సమాజ సేవ కార్యక్రమాలు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలవాలని మంచిర్యాల జిల్లా స్వచ్ఛంద సంస్థ సభ్యులు రహీమ్, సలీమ్‌లు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో బెస్ట్ ఫ్రెండ్ సొసైటీ అధ్యక్షుడు అజీజ్‌ను శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. పేదలకు, అభాగ్యులకు తనవంతుగా సహాయ కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అక్షయ్, సాహిల్, తాజ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

తాంసి: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. సోమవారం సాయంత్రం భీంపూర్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ సిబ్బందితో కలిసి ధనోర ఎక్స్‌రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహించారు. రోడ్డుపై వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లేవారు తగిన ఆధారాలు చూపాలన్నారు. లేకపోతే నగదును సీజ్ చేస్తామని తెలిపారు. ఎస్సై వెంట కానిస్టేబుల్ రాఘవేంద్ర, రాందాస్ ఉన్నారు.

ఓటరు నమోదుకు అవకాశం

- కొత్తగా నమోదుకు ఈ నెల 31 వరకు గడువు
- ఇకనైనా మేలుకోండి
- ఓటర్ల పోలింగ్‌బూత్‌ల మార్పునకు నోఛాన్స్
- తొలగింపులు సైతం ఉండవు

ఆదిలాబాద్ నియోజవర్గంలో ఓటరు ఇలా..

పోలింగ్ బూత్‌లు	: 290
ఓటర్లు	: 2,35,748


దరఖాస్తు చేసుకుంటున్న యువకులు(ఫైల్)

బేల: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం అర్హులకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు మరోసారి అవకాశం కల్పించింది. ఈ ఓటరు నమోదుకు గత నెల 18వ తేదీ దరకు చివరి గడువు ఉండగా ఈ నెల 4వ తేదీన ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. అయితే ఈ క్రమంలో ఓటరు నమోదు చేసుకోని వారెవరైనా ఉంటారనే ఆలోచనతో ఈ నెల 31వ తేదీ వరకు కొత్తగా నమోదుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఓటర్ల పోలింగ్ బూత్‌ల మార్పునకు నోఛాన్స్. దీంతో పాటు ఏమాత్రం తొలగింపులు సైతం ఉండవు.

ఇకనైనా మేలుకోండి..

ఈ అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతి, యువకులే కాక ఇప్పటి వరకు ఓటు హక్కు లేని వారు సైతం కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ క్రమంలో ఐదేళ్ల పాటు ప్రజలను పాలించే వారిని ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలకమవుతోంది. మంచి నాయకులను ఎన్నుకోవాలంటే అందరికీ ఓటు హక్కు ఉండడంతో పాటు ఓటు వేయడం తప్పనిసరి. అందుకే అర్హులైన యువత, వయోజనులు, ఇతరత్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు ప్రచారం చేస్తున్నారు. ఈ మేరకు ఓటు హక్కు లేని వారంతా ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే, రానున్న శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఓటు ఉందో లేదో ఇలా తెలుసుకోవచ్చు

ఓటు ఉందో లేదో స్థానిక పోలింగ్ బూత్‌ల బీఎల్‌వోను, ఎలక్షన్ సూపర్‌వైజర్‌లను సంప్రదించి తెలుసుకోవచ్చు. దీంతో పాటు వివిధ రకాల వెబ్‌సైట్‌లు అందుబాటులో ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన వెబ్‌సైట్‌లు www.nvsp.in, voters.ecigov.inతో పాతో పాటు రాష్ట్రానికి సంబంధించి www. ceotelangana. nic.in వెబ్‌సైట్ లోనే కాకుండా ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. అంతేకాకుండా కంట్రోల్ రూం. 1950నంబరుకు ఫోన్ చేసినా సమాచారం ఇస్తారు.

ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలంటే..

సత్వరమే కొత్తగా ఓటరు నమోదు కోసం ఆయా స్థానిక పోలింగ్ బూత్‌ల తాలుకు బీఎల్‌వోలు, ఎలక్షన్ సూపర్‌వైజర్‌ల వద్ద దరఖాస్తు చేసుకోవాలి. లేదంటే నేరుగా మండల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఓటు లేని వారు ఫారం-6ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో పాటు తప్పులు సరిచేసుకోవడానికి, కేవలం చిరునామా మార్పుకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కానీ ఓటర్ల పోలింగ్ బూత్‌ల మార్పు, పూర్తిగా పేర్లు తొలగింపునకు మాత్రం ఇప్పుడు అవకాశం లేదని అధికారులు స్పష్టం చేశారు.

మూఢనమ్మకాలు విశ్వసించొద్దు


మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి రవీందర్‌రెడ్డి

బేల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక ప్రతినిధి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాలు విశ్వసించొద్దని సూచించారు. సైన్స్ ప్రాముఖ్యత, అభివృద్ధిపై వివరించారు. ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి రూపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎంపీ పరామర్శ


మాట్లాడుతున్న మాజీ ఎంపీ గొడం నగేష్

నేరడిగొండ: మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మడావి కృష్ణ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎంపీ గొడం నగేష్ సోమవారం వారి నివాసానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు గాదె శంకర్, కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, మాజీ ఎంపీటీసీ ఆత్రం లక్ష్మణ్, మురళి గౌడ్, వెంకటరమణ, లస్మన్న ఉన్నారు.

దసరా ఉత్సవాలకు తరలిరావాలి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీ రామ్ లీలా మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు తరలిరావాలని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ యోగానంద సరస్వతి స్వామి అన్నారు. శనివారము మైదానంలో దసరా ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ సమితి ఆధ్వర్యంలో 11ఏళ్లుగా దసరా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతిఒక్కరూ దసరా ఉత్సవాలను భక్తిశ్రద్ధల నడుమ జరుపుకోవాలని, హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రీ మాట్లాడుతూ విజయదశమి రోజున సాయంత్రం 4 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ అనంతరం రావణ దహన ఘట్టం ఉంటుందని వెల్లడించారు. ఈ వేడుకలకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి గెడం మాధవ్, గౌరవాధ్యక్షులు ప్రఫుల్ వార్షే, సభ్యులు ట్రేజరర్ సూర్య కాంత్ రవీందర్, నర్సోజి, శ్రీనివాస్, శశికళ చౌహన్, విజయ్, నర్సింలు , మీసాల స్వామీ , గంగాధర్ , దేవిదాస్, దశరథ్ , మహేందర్ , సంజీవ్, ప్రభాకర్ , ఉరే గణేష్ , మహిపాల్ ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

నేరడిగొండ: మండలంలోని పెద్ద బుగ్గారం గ్రామంలో శ్రీ జగదాంబ దేవి విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. గ్రహాల ఊరేగింపు శాంతి పాఠం, గోపూజ గణపతి గౌరీ పూజ, స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విక వర్ణనం, అఖండ దీపారాధన, నవగ్రహ, వాస్తు యోగిని, క్షేత్రపాలక సర్వతో భద్ర మండప పూజలు, అగ్నిప్రతిష్టాపన, స్థాపితదేవత హోమాలు, విగ్రహాల జలాధివాసం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితులు శ్రావణ్ కుమార్ జోషి, సాయి మహరాజ్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. మంగళ, బుధ వారాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

పరామర్శ

బోథ్: మండలంలోని పార్డి(బి) ఎంపీటీసీ సిడం శంభు ఇటీవల అనారోగ్యానికి గురై ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఎంపీపీ తుల శ్రీనివాస్ సోమవారం అతడిని పరామర్శించారు. ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ సురేందర్ ఉన్నారు.